క్లుప్తంగా

ఆటోడ్రైవర్‌పై దాడి

నెల్లూరు(క్రైమ్): ఆటోడ్రైవర్‌పై కొందరు దాడి చేసిన ఘటనపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. కొత్తూరులోని వైఎస్సార్‌నగర్‌లో నివాసం ఉంటున్న సుబ్బరాయుడు ఆటో నడుపుకొని జీవనం సాగిస్తున్నారు. నగరానికి చెందిన ఇస్మాయిల్ ఈయన స్నేహితుడు. ఇస్మాయిల్ తన భార్యతో విడిపోయి దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలో వారం క్రితం స్నేహితుడి భార్యతో ఫోన్లో సుబ్బరాయుడు మాట్లాడి.. విభేదాలను వీడి కాపురాన్ని చక్క దిద్దుకోవాలని కోరారు. ఈ తరుణంలో ఆటోలో సుబ్బరాయుడు వెళ్తుండగా, డెయిరీ వద్దకు వచ్చేసరికి శ్రీను, సురేష్, బన్నీ, రాజేష్ అటకాయించారు. ఆమెతో ఫోన్లో లేనిపోని మాటలు ఎందుకు మాట్లాడుతున్నావు.. తమ గురించి ఎందుకు చెప్తున్నావంటూ దాడి చేశారు. గాయపడిన సుబ్బరాయుడు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేరారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వేణుగోపాల్ మృతి తీరని లోటు

నెల్లూరు (టౌన్): ఉపాధ్యాయుడు వేణుగోపాల్ మృతి ఎస్టీయూకు తీరని లోటని సంస్థ జిల్లా అధ్యక్షుడు రాజమనోహర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోవూరు మండలంలోని పాటూరు ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ గుండె సంబంధిత సమస్యతో అపోలో ఆస్పత్రితో చికిత్స పొందుతూ మరణించారని చెప్పారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

రంగడి దేవస్థానంలో రాపత్తు ఉత్సవం



నెల్లూరు(బృందావనం): అధ్యయనోత్సవాలను పురస్కరించుకొని నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో రాపత్తు ఉత్సవాన్ని నేత్రపర్వంగా ఆదివారం నిర్వహించారు. దేవస్థాన ప్రధానార్చకులు జగన్నాథాచార్యులు, సుదర్శనాచార్యులు ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఉభయకర్తగా వెంకటసుబ్బయ్యశెట్టి వ్యవహరించారు. ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి, తదితరులు పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి రూ.45 వేల వితరణ



నెల్లూరు రూరల్: వేదాయపాళెంలోని స్వర్ణ దీపం ట్రస్ట్ అనాథాశ్రమానికి రూ.45 వేల ఆర్థిక సాయాన్ని ఎస్వీఎస్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఆదివారం అందజేశారు. హరనాథపురంలోని స్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ మొత్తాన్ని ట్రస్ట్ నిర్వాహకుడు రఫీకి 25 కళా సంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి అందించారు. హైదరాబాద్‌కు చెందిన ఎమ్మెస్సార్ వృద్ధాశ్రమ నిర్వాహకుడు శ్రీనివాస్, ఎస్వీఎస్ స్కూల్ కరస్పాండెంట్ వెంకటేశ్వర్లురెడ్డి, హరిబాబు, అమీర్‌జాన్, హరనాథ్‌రెడ్డి, సుబ్బారెడ్డి, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన అష్టావధానం



నెల్లూరు(బృందావనం): పురమందిర ప్రాంగణంలోని ఏసీ హాల్లో గౌరీభొట్ల రామశర్మ అష్టావధానాన్ని పద్యకళాపరిషత్ అధ్యక్షుడు రామచంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. తొలుత దీపప్రజ్వలన చేశారు. అనంతరం సమాజంలోని ఎన్నో అంశాలను స్పృశిస్తూ ఎందరో కవులు తమ వినూత్న కవితలను చదివి వినిపించారు. వేదసంస్కృత కళాశాల విశ్రాంత ఆంధ్రోపన్యాసకురాలు గిరిజాలక్ష్మి అధ్యక్షతన కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రముఖ సాహితీవేత్త మా శర్మ, విశ్రాంత ఆచార్యుడు సూరం శ్రీనివాసులు, అగస్త్యరాజు సుబ్బారావు, వైద్యుడు సింగరాజు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామికి ధనుర్మాస పూజలు

పొదలకూరు: పట్టణంలోని శ్రీలక్ష్మీ గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం తెల్లవారుజామున ధనుర్మాస పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరస్వామి, శ్రీలక్ష్మీ గోదాదేవి అమ్మవార్లకు అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. పలువురు దంపతులు పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

గడప గడపకు సంక్షేమ ఫలాలు

కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



ప్రభుత్వ పథకాల కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

బిట్రగుంట: రాష్ట్రంలోని అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. జక్కేపల్లిగూడూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం సంక్షేమ పథకాలను వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు పారదర్శకంగా ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలను అందించే లక్ష్యంతో సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను ఏర్పాటు చేశారని వివరించారు. సచివాలయ వ్యవస్థ ద్వారా గడప గడపకు సంక్షేమ పథకాలను చేరుస్తున్నారని తెలిపారు. అర్హత ఉండి సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకాలకు నోచుకోని లబ్ధిదారులను గుర్తించి అందించేందుకు ప్రభుత్వం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. జక్కేపల్లి గూడూరు సచివాలయం పరిధిలో రూ.25లక్షలతో అంతర్గత రోడ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. జక్కేపల్లిగూడూరు ఎస్టీవీ కండ్రిగ, ఏబీ కండ్రిగ సర్పంచ్‌లు బండ్ల సురేష్, ఉప్పాల మాచర్ల, బత్తల శ్రీనివాసులు, ఎంపీటీసీ సుందరరాజ్, వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దిబోయిన వీరరఘు, తూపిలి పెంచలయ్య, గండూరి శ్రీనివాసులు, షమీవుల్లా, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న విజయభాస్కర్‌రెడ్డి

చేజర్ల: క్రీడలు మానసికోల్లాసానికి ఎంతో దోహదపడుతాయని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తుమాటి విజయభాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ పీర్లపార్థసారథి పేర్కొన్నారు. సంక్రాంతి సందర్భంగా చేజర్లలోని గొల్లపల్లి మైదానంలో సంక్రాంతి కళ్యాణ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎంజీఆర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ఉదయం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టోర్నమెంట్‌ను ఎలాంటి వివాదాలు లేకుండా ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సూచించారు. ఆత్మకూరు నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తున్న టోర్నమెంట్‌లో 30 జట్లు పోటీ పడనున్నట్లు తెలిపారు. లైవ్‌స్కోరును వీక్షించేందుకు క్రీడాకారుల కోరిక మేరకు యాప్ లింక్‌ను విడుదల చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మరిడినాయుడు, ప్రముఖ వైద్యులు ప్రణీత్‌రెడ్డి, పాడేరు సర్పంచ్ గుమ్మా వెంకటేశ్వర్లు, మహ్మరఫీ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉడతా హజరత్తయ్య, జీ రత్నయ్య, వంగవరపు ఆనందరెడ్డి, హరి, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బ్యాటింగ్‌తో అలరించిన ఎమ్మెల్యే రామిరెడ్డి



ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి : గత నెల 21న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా పట్టణంలోని తుమ్మలపెంట రోడ్డు జెడ్పీ హైస్కూల్ మైదానంలో ప్రారంభించిన వైఎస్ జగనన్న క్రికెట్ టోర్నమెంట్ రసవత్తరంగా సాగుతోంది. ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మన్నెమాల సుకుమార్‌రెడ్డి సహకారంతో కావలి నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్‌లో తొలిరౌండ్ మ్యాచ్‌ల్లో క్రీడాకారులు పోటాపోటీగా తలపడుతున్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు టోర్నమెంట్ నిర్వాహకులు ఈతమొక్కల చంద్రశేఖర్ రెడ్డి, మన్నెమాల ధీరజ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి యూత్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వైద్యుల మధ్యన ఆదివారం ఎగ్జిబిషన్ మ్యాచ్ నిర్వహించారు. ఈ మ్యాచ్‌లో యూత్ జట్టు తరుపున బరిలోకి దిగిన ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి దూకుడుగా ఆడి వరుస బౌండరీలతో అందరిని అలరించారు. బంతితోనూ చక్కగా బౌలింగ్ చేసి యువకుల్లో స్ఫూర్తి నింపారు.

సోమశిల హైలెవల్ కెనాల్‌ను పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం

మర్రిపాడు : రాష్ట్ర ప్రభుత్వం సోమశిల హైలెవల్ కెనాల్ పనులను త్వరితగతిన పూర్తి చేసి మెట్ట ప్రాంత రైతాంగాన్ని ఆదుకోవాలని ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం కోరారు. మర్రిపాడులో ఆదివారం నిర్వహించిన అఖిలపక్ష రైతు సదస్సులో ఆయన మాట్లాడారు. హైలెవల్ కెనాల్ పనులు ప్రారంభించిన తరువాత మూడు ప్రభుత్వాలు మారినా ఇంత వరకు పూర్తి చేయకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించి హైలెవల్ కెనాల్‌ను పూర్తి చేయించాలన్నారు. కెనాల్ పూర్తయితే మర్రిపాడు మండలంతో పాటు ఉదయగిరి నియోజకవర్గంలోని వింజమూరు, దుత్తలూరు మండలాలకు సాగు, తాగునీటి సమస్యలు తీరుతాయన్నారు. ఇందుకోసం రైతు సంఘం తరఫున తాము పోరాటం చేస్తామన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, రైతు సంఘ నాయకులు చంద్రా రాజగోపాల్, పులిగొండ్ల శ్రీరాములు, జిల్లా రైతు సంఘ కార్యదర్శి మాలి వెంగయ్య, కౌలు రైతు సంఘ నాయకులు గంటా లక్ష్మీపతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, నాయకులు కోనంకి శ్రీనివాసులునాయుడు, అమర్‌నాథ్‌రెడ్డి, ఎం పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఉపసర్పంచ్ కొండారెడ్డి

కలిగిరి: స్థానిక గ్రామ సచివాలయంలో పారిశుధ్య కార్మికులకు ఉపసర్పంచ్ పాలూరు కొండారెడ్డి ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో పారిశుధ్యం మెరుగునకు నిరంతరం కృషి చేస్తున్న 26 మంది కార్మికులకు దుస్తులతో పాటు కొబ్బరి నూనె, సబ్బులు, స్వీట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శి చెంచుకృష్ణారెడ్డి, వార్డు సభ్యులు గునపాటి మహేష్‌రెడ్డి, వేమనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేల స్థావరాలపై దాడులు



కావలిరూరల్: అదుపులోకి తీసుకున్న పందెంరాయుళ్లతో పోలీసులు



మర్రిపాడు: అదుపులోకి తీసుకున్న పందెంరాయుళ్లతో పోలీసులు

కావలి రూరల్: మండలంలోని రాజువారి చింతలపాళెం, పెద్దవరం గ్రామాల మధ్యన అటవీ ప్రాంతంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో రూరల్ ఎస్సైలు ఎం వెంకటరావు, జీ వీరేంద్రబాబు తమ సిబ్బందితో ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 12 మంది పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి మూడు కోళ్లు, రూ.15,500 నగదు స్వాధీనం చేసుకున్నారు.

అరుగురు పందెంరాయుళ్ల అరెస్ట్

మర్రిపాడు: మండలంలోని సింగనపల్లి గ్రామ సమీపంలో కోడిపందేల స్థావరం నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఆత్మకూరు సీఐ నాగేశ్వరరావు నేతృత్వంలో పోలీసు సిబ్బంది ఆదివారం సాయంత్రం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అరుగురు పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.2,150 నగదు, నాలుగు కోళ్లు, ఆరు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ నాగేశ్వరరావు మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా కోడిపందేలు, జూదాలు నిర్వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ దాడుల్లో అనంతసాగరం, మర్రిపాడు ఎస్సైలు సంతోష్‌కుమార్‌రెడ్డి, రాజేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉదయగిరిలో సేవా కార్యక్రమాలు

ఉదయగిరి: ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప యాత్ర పూర్తి చేసి నాలుగేళ్లు పూర్తయిన నేపథ్యంలో ఉదయగిరిలో ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డి సోమవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మహిళా నేత ఎస్ శాంతకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తారని చెప్పారు. అనంతరం కేక్ కట్ చేసి సేవా కార్యక్రమాలను ప్రారంభిస్తారని వివరించారు.

ఉచిత వైద్యశిబిరం

సోమశిల: అనంతసాగరం మండలం రేవూరులో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామానికి చెందిన ప్రముఖ వైద్యనిపుణులు డాక్టర్ మాదమాల ప్రమీల రాంగోపాల్‌రెడ్డి 400 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, తదితర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు మూడు నెలలకు సరిపడా మందులు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కాకూరు రామలింగారెడ్డి, కేతా సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం




అనుమసముద్రంపేట: ఎడ్నెమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని నిరుపేద పాస్టర్లకు ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. రాజవోలు ఈఎంసీ చర్చి పాస్టర్ సుదీర్‌బాబు మాట్లాడుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పాస్టర్లకు మానవతా దృక్పథంతో తమ ట్రస్టు ద్వారా ఆర్థిక సాయం అందజేసినట్లు తెలిపారు. ఈఎంసీ చర్చి ట్రస్టు సభ్యులు, పాస్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



ఆత్మకూరు: రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్(రూటా) క్యాలెండర్లను ఆ అసోసియేషన్ నెల్లూరు శాఖ అధ్యక్షుడు సయ్యద్‌అబ్దుల్ హమీద్ ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. పట్టణంలోని అభిరామ్ ఆస్పత్రి వద్ద మున్సిపల్ వైస్‌చైర్మన్ కేవీ శ్రావణ్‌కుమార్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉర్దూను రెండో అధికార భాషగా గుర్తించిందన్నారు. మైనార్టీల విద్యాభివృద్ధికి ప్రభుత్వ కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సాధిక్‌హుస్సేన్, షేక్ జావేద్, అహ్మద్ మొహిద్దీన్, షేక్ జిలానీబాషా, ఖాజాహుస్సేన్, ఖాదర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనుల ప్రారంభం



ఆత్మకూరురూరల్: మండలంలోని బోయలచిరివెళ్ల ఎస్సీకాలనీలో డ్రైనేజీ నిర్మాణాన్ని సర్పంచ్ బొలిగర్ల వెంకటేశ్వర్లు ఆదివారం ప్రారంభించారు. పంచాయతీ నిధులతో డ్రైనేజీ నిర్మాణం చేపడుతున్నామని ఆయన తెలిపారు. సచివాలయ కన్వీనర్ రావూరి శ్రీనివాసులురెడ్డి, జనార్దన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అచ్చమాంబకు పొంగళ్లు

మర్రిపాడు: మండలంలోని పొంగూరు మాలిచేలో కొలువైన అచ్చమాంబ పేరంటాళ్ల ఆలయం వద్ద ఆదివారం భక్తులు పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. మహిళలు ఉపవాసాలు ఉండి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. రాత్రి భజనలు చేశారు.

గురుకులంలో సంక్రాంతి సంబరాలు



ఆదూరుపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఆదివారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు రంగవల్లులు తీర్చిదిద్ది భోగి మంట వేసి సంక్రాంతి పాటలను ఆలపించారు. హరిదాసులు, గంగిరెద్దుల వేషధారణలతో విద్యార్థినులు ఆకట్టుకున్నారు. ప్రిన్సిపల్ శైలజకుమారి, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు. –చేజర్ల

ఐక్యతతో సమస్యలు పరిష్కారం



సమావేశానికి హాజరైన విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు

ఉదయగిరి: విశ్వబ్రాహ్మణులు ఐక్యతగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని విశ్వబ్రాహ్మణుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అల్లూరు తిరుపాలు అన్నారు. ఉదయగిరిలోని టీటీడీ కల్యాణ మండపంలో విశ్వబ్రాహ్మణుల సంఘం నియోజవర్గస్థాయి సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు. సంఘ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డిని కలిసి సమస్యలను పరిష్కరించుకోవడానికి అందరూ ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయాచారి, సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర ఆచారి, రవీంద్ర, బ్రహ్మయ్య, హరిప్రసాద్, శ్రీనివాసాచారి, సుబ్బారావు, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ప్రారంభం



లోగోను ఆవిష్కరిస్తున్న చైర్మన్ కాకర్ల సురేష్

కలిగిరి: మండలంలోని బొమ్మరాజుచెరువు వద్ద కాకర్ల చారిటబుల్ ట్రస్ట్‌ను ఆదివారం ప్రారంభించారు. ట్రస్ట్ చైర్మన్ కాకర్ల సురేష్ ట్రస్ట్ లోగోను ఆవిష్కరించి మాట్లాడారు. తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉదయగిరి నియోజకవర్గంలో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యశిబిరాలు, క్రీడా పోటీలకు సహకారం, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, పేద రైతులకు చేయూత అందించనున్నట్లు వివరించారు. అనంతరం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

పేర్నాటిని ఆశీర్వదించండి



కలిగిరిలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కలిగిరి: తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డిని ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి కోరారు. పేర్నాటికి మద్దతుగా కలిగిరిలో ఆదివారం ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే లక్షలాదిమంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించిందని గుర్తుచేశారు. పేర్నాటిని ఎమ్మెల్సీగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పట్టభద్రులను కోరారు. వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ మాలేపాటి వెంకటసుబ్బయ్య, ఉపసర్పంచ్ పాలూరు కొండారెడ్డి, స్థానిక నాయకులు అవుల ప్రభాకర్‌రెడ్డి, సుబ్బనాచారి, తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పిన అంబులెన్స్




ఉదయగిరి: సీతారామపురం వైపు వెళ్తున్న ఓ ప్రైవేట్ అంబులెన్స్ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని రోడ్డుపక్కనున్న ఇంట్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటన మండలంలోని కుర్రపల్లి సమీపంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు..ఉదయగిరికి చెందిన శ్యాంసుందర్ తన ప్రైవేట్ అంబులెన్స్ వాహనంలో సీతారామపురానికి వెళుతుండగా కుర్రపల్లి సమీపంలో వాహనం అదుపుతప్పి ప్రమాదం జరిగింది. వాహనంలోని ఎయిర్‌బ్యాగులు తెరుచుకోవడంతో శ్యాంసుందర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలేరమ్మ జాతరకు ముస్తాబు

అల్లూరు: పోలేరమ్మ జాతరకు అల్లూరుపేట ముస్తాబైంది. మంగళవారం జరుగనున్న జాతరకు పోలేరమ్మ ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో ముస్తాబు చేశారు. ఆలయంతో పాటు జాతర జరిగే వీధుల్లో ఆకట్టుకునేలా విద్యుద్దీపాలతో భారీ స్థాయిలో దేవతామూర్తులు, ఈఫిల్ టవర్ ఆర్చీలను ఏర్పాటు చేశారు.



పోలేరమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన దేవతామూర్తుల ఆర్చీలు



బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఈఫిల్‌టవర్ నమూనా

